నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 నిజామాబాద్ ఆదివారం 18 ఆగస్టు 2024 ADILABAD NIRMAL

## నేరాల నియంత్రణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, ఆగస్టు 17 : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు కృషి చేయాలని పోలీసు అధికారులను నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. సామాన్యులను దృష్టిలో ఉంచుకుని భరోసా కల్పించేలా విధంగా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. పోలీసులు అనైతిక చర్యలకు పాల్పడితే, క్రమశిక్షణ చర్యలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే పండుగలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సరిహద్దులనై నిఘా ఉంచి గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, స్మగ్లర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయుధాల లైసెన్స్ జారీపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు.

## ప్రైవేట్ వైద్యులు నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఆగస్టు 17: వ్యాధి తీవ్రతను బట్టి, అత్యవసరమైతేనే రోగులను దవాఖానలో అడ్మిట్ చేసుకోవాలని, అకారణంగా వారిపై ఆర్థిక భారం మోపవద్దని ప్రైవేట్ వైద్యులను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రైవేట్ దవాఖానలో వైద్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..అర్హులు, నిపుణులైన వైద్యులతో చికిత్స అందించాలన్నారు. దవాఖానకు వచ్చిన వారికి మొదటగా మందులు ఇవ్వాలన్నారు. వ్యాధి తీవ్రంగా ఉంటేనే అడ్మిట్ చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రిమ్స్‌లో డెంగ్యూ నిర్ధారణ కిట్లున్నాయని పరీక్షలు చేయించాలన్నారు. అనుమతి లేకుండా హాస్పిటళ్లను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, డీఎంహెచ్‌వో కృష్ణ, పీవోడీటీవో నరేందర్ రాథోడ్, ఐఎంఐ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, ప్రైవేట్ దవాఖాన వైద్యులు ఉన్నారు.

### రుణమాఫీ కాలేదు.. పెట్టుబడి సాయం అందలేదు..



లోకేశ్వరం, ఆగస్టు 17: నాకు భర్త లేదు, మాకున్న భూమిలో పంటలు సాగు చేసుకుంటూ బతుకుతున్నం. నా పేరిట రూ. 1,60,000లు బ్యాంకులో పంట రుణం ఉంది. మూడో విడుత రైతు రుణమాఫీ లిస్ట్‌లో కూడా నా పేరు లేదు. రుణమాఫీ లేదు. రైతు భరోసా పెట్టుబడి సాయం ఇంకా ఇవ్వలేదు. వరి నాటు, ఎరువులకు తెచ్చిన అప్పులు అట్లనే ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు మాకు తగిన బుద్ధి చెప్పారు.

*-గంజాల శారద, రాయపూర్ కాండ్లి, మండలం లోకేశ్వరం*

### రుణమాఫీకి తిరకాసులు పెట్టొద్దు



తాంసి, ఆగస్టు 17 : నాకు జామిడి లో 4.38 ఎకరాల భూమి ఉన్నది. రూ.లక్షా 60వేలు పంట రుణం తీసుకున్న. సీఎం రేవంత్ రెడ్డి రుణ మాఫీ చేస్తామంటే ఎనిమిది నెలల నుంచి ఎదురు చూస్తున్నా. శుక్రవా రం ప్రకటించిన రుణమాఫీ జాబితా లో నా పేరు లేదు. సార్లను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. రుణమాఫీ గురించి ఎవరిని అడగాలి. రైతులకు రుణమాఫీ చేస్తామని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అధికారుల తప్పిదంతో హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు స్పందించి నా పేరిట ఉన్న రుణం మాఫీ అయ్యేలా చూడాలి.

*- ఏనుగు నరోత్తం రెడ్డి, జామిడి గ్రామం, తాంసి మండలం*

### కాంగ్రెస్‌ల తిరిగేటోళ్లకు కూడా రుణమాఫీ కాలే..



నాకు 3 ఎకరాల భూమి ఉన్నది. పత్తి జొన్న పంటలేశాను. రేషన్ కార్డు ఆధారంగా రుణమాఫీ అన్నారు. అట్లయినా నా పేరిట రూ. 1.30లక్షలు మా అమ్మ పేరిట రూ. 90 వేలు మొత్తం కలిపి రూ. 2.20 లక్షలున్నాయి. రెండు నెలల కిందటనే రెన్యూవల్ చేసుకున్న. ఇప్పుడు రూ. 2 లక్షలు మాఫీ అవుతదనుకున్న. కానీ లిస్టుల పేరు లేక ఎంతో బాధపడిన. రూ. 2 లక్షలకు మించి ఉన్న వడ్డీ అయినా, అసలు అయినా ఆ మొత్తం బ్యాంకులో చెల్లిస్తే మాఫీ అని సర్కారు ముందే చెప్తే బాగుండు. మా పక్క గ్రామంల కాంగ్రెస్ పార్టీల తిరిగేటి రైతులకు కూడా రుణమాఫీ కాకపోవడంతో పరేషానవుతున్నరు.

*- బక్కి గణేశ్, చిన్నకారు రైతు, కరంజి(టి),భీంపూర్ మండలం*


తలమడుగులో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను చెప్పుతో కొడుతున్న రైతులు


తలమడుగులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న రైతులు

# రుణమాఫీ కోసం రణం

## సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం
- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- పలుచోట్ల అధికారుల నిలదీత
- కవ్వాల్ జీపీ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం


రైతులకు మద్దతుగా జైనథ్‌లో రోడ్డుపై బైఠాయించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, ఆగస్టు 17 ( నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు వర్తించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. రాస్తారోకోలు.. ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. తలమడుగు మండలం కేంద్రంలో 500 మంది రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను డప్పులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శవయాత్ర నిర్వహించి చెప్పులతో కొట్టారు. అనంతరం దహనం చేశారు. బోథ్‌లో రైతులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భీంపూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. బోథ్ మండల కేంద్రంలో నిరసన ర్యాలీ తీసి నిర్మల్ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తాంసి, గిమ్మలో రైతులు ఆందోళన చేపట్టారు. రుణమాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రుణమాఫీ ఎందుకు కాలేదని ఏఈవోలను నిలదీశారు. జైనథ్ మండలం కేంద్రంలో జరిగిన రాస్తారోకోలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రోడ్డుపై బైఠాయించి రైతులకు మద్దతు ప్రకటించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కేవలం 40 శాతం మంది రైతులకు నామ్‌కే వాస్తేగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం అర్హులైన రైతుల పంట రుణాలు మాఫీ చేసే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని రైతులు తెలిపారు. జైనథ్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బీవోఎం మేనేజర్ శివ ప్రసాద్‌ను రుణమాఫీ కాలేదని రైతులు నిలదీశారు. బ్యాంకు అధికారులు రుణ డేటా తప్పుల తడకగా ఉందని, తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట రైతులు రాస్తారోకో చేశారు. పోలీసు, వ్యవసాయ అధికారులు సముదాయించినా వినలేదు. కలెక్టర్‌తో ఫోన్‌లో రైతులతో మాట్లాడించారు. ఆదిలాబాద్ ట్రెయినీ అభిగ్యాన్ మాలవియా జైనథ్ బ్యాంక్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా రాస్తారోకోను విరమించారు. జైనథ్‌లో బోరజ్ జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రాకపోకలకు 40 నిమిషాల పాటు అంతరాయం కలిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన రైతులు అర్హులకు రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య రైతుల వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని సూచించడంతో రైతులు ఆందోళన విరమించారు.

### రుణ మాఫీపై అయితదని ఎదురుచూసిన..



భీంపూర్, ఆగస్టు 17 : నాకు కరంజి శివారులో 5 ఎకరాల భూమి ఉన్నది. అర్లి బ్యాంకులో రూ. 2 లక్షల పంట రుణం ఉన్నది. ఇగ మాఫీ అస్తది అగో అస్తది అని ఇన్ని రోజులు ఆశతోని ఎదురుచూసినం. ఆఖరికి రాకనేపాయే. ఇగ ఎట్ల జేసుడో అర్థం కావట్లేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు రైతుబంధు, రుణమాఫీ మంచిగ అయినయి. గా దినాలు మా రైతులందరికీ ఇప్పుడు యాదికస్తున్నయి. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఇట్ల చెయ్యవట్టె. ఒక్క మా కరంజిలనే రుణమాఫీ రానోళ్లు ఎంతోమంది ఉన్నరు. ఇట్లయితే ఎవుసాలు పడీతు( పడావు)భూములయిపోతయి. కలెక్టర్ సార్ పట్టించుకొని రుణమాఫీ చేయాలె.

*- మర్ల విఠల్ , రైతు ,కరంజి(టి), భీంపూర్ మండలం*

### కేసీఆర్ సారే మంచోడు అంటున్నరు..



భీంపూర్, ఆగస్టు 17 : నాకు 2.20 ఎకరాల భూమి ఉన్నది. పత్తి, తొగరి, జొన్న పంటలు వేసినం. నాకు అర్లి గ్రామీణ బ్యాంకుల రూ. 1.15 లక్షల పంట రుణం ఉన్నది. కానీ మాఫీ కాలేదు. ఏమి చెయ్యాలనో అర్థం అయితలేదు. నా తీరే మా ఊళ్లే ఎంతో మంది రైతులకు మాఫీ రాలేదు. అందుకే ఇయ్యాలా భీంపూర్ పోయి నిరసన చేసినం. అన్ని గ్రామాల నుంచి అన్ని పార్టీల రైతులు పాల్గొన్నారు. రైతులను ఇట్ల మోసం చేయడం మంచిది కాదు. కేసీఆర్ సారే మంచిగుండె అని అంతా అంటున్నరు. ఇప్పటికైనా సార్లు మా గోస పట్టించుకోవాలే.

*- యెయ్య వామన్ , రైతు , కరంజి(టి),భీంపూర్ మండలం*

### మేము రైతులం కాదా..?



తాంసి, ఆగస్టు 17 : పంట వేయడానికి రూ.లక్షా ముప్పై వేలు అప్పు తీసుకున్న కాంగ్రెస్ సర్కారు రూ.2 లక్షలలోపు పైసలు మాఫీ చేస్తామని చెప్పిండు. మూడో లిస్టులో సారోళ్లు ఇచ్చిన పేపర్లలో నా పేరు లేదంట. నేను రైతును కాదా ? పంట కోసం అప్పు తీసుకునోళ్లందరికీ మాఫీ చేయాలే. పాత సర్కారోళ్లు చెప్పినకాడికి అందరికీ రుణం మాఫీ చేసింద్రు. వీళ్లు మాత్రం కొందరికీ ఇచ్చి మిగిలినోళ్లకు ఇయ్యమంటే బాగుండదు. మా బాధలను అర్థం చేసుకొని అప్పు మాఫీ చేయాలి.

*- మునీశ్వర్ విజయ్ భరత్, రైతు, జామిడి, మండలం తాంసి*

## రాఖీ కట్టి..రక్షణ కల్పించాలని విన్నవించి..


ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు రాఖీ కడుతున్న వైద్యురాలు

*రిమ్స్‌లో రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌ను జూనియర్ వైద్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఆదిలాబాద్ కలెక్టరేట్లో కలెక్టర్ రాజర్షి షాను కలిసి రక్షబంధన్ సందర్భంగా ముందస్తుగా రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కోల్‌కతాలో జరిగిన ఘటన నేపథ్యంలో రిమ్స్‌లో వైద్యురాళ్లు, మహిళలకు రక్షణ పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఎస్పీతో మాట్లాడి రక్షణ చర్యల కల్పించాలని పలు సూచనలు చేశారు.*

*- ఎదులాపురం,ఆగస్టు17*



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేస్తున్న రిమ్స్ జూనియర్ వైద్యులు, వైద్యులు

# వియ్ వాంట్ జస్టిస్

- కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార నేరస్తులను ఉరితీయాలని డిమాండ్
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లో జూడాలు, వైద్యుల, ప్రజా సంఘాల రాస్తారోకోలు

ఆదిలాబాద్, ఆగస్టు 17 ( నమస్తే తెలంగాణ): బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్‌లో రిమ్స్ జూనియర్ డాక్టర్లు భారీ నిరసన ర్యాలీ తీశారు. వీరి ఆందోళనకు నర్సింగ్ అధికారులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు మద్దతు తెలిపారు. విధులు బహిష్కరించిన జూడాలు రిమ్స్ నుంచి తెలంగాణ చౌక్ మీదుగా బస్టాండ్ వరకు భారీ ర్యాలీ తీశారు. బస్టాండ్ వద్ద మానవహారం, రాస్తారోకో చేపట్టారు. హిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నిర్మల్‌లో విధులు బహిష్కరించిన వైద్యులు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు,17: వైద్యురాలిపై ఆఘాయిత్యానికి పాల్పడిన నిందితులను ఉరితీయాలని, వైద్యురాలి హత్యకు వ్యతిరేకంగా శనివారం నిర్మల్ పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన తెలిపారు. జనప్రియ సీటీ స్కాన్ సెంటర్ నుంచి మంచిర్యాల చౌరస్తాలోని శివాజీ చౌక్ వరకు నిరసన ర్యాలీ తీశారు. వైద్యులు, కళాశాల విద్యార్థినులు వాహనాలపై ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు, ఎస్పీకి వినతిపత్రాలు ఇచ్చారు. ఐఎంఏ, ఎన్‌డీఏ, ఐడీఏ, తెలంగాణ డయాగ్నస్టిక్ అసోసియేషన్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్, జన విజ్ఞాన వేదిక, తెరవె, తెలంగాణ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్ వివిధ స్వచ్ఛంద సంస్థలు నిరసనలో పాల్గొన్నాయి.

### మహిళలకు రక్షణ లేదు..



దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 సంవత్సరాలైనా మహిళలకు మాత్రం రక్షణ లేదు. బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటనే నిదర్శనంగా చెప్పవచ్చు. వైద్యురాలిపై కాకుండా మహిళపై జరిగిన ఘటనగా సమాజం చూడాల్సిన అవసరం ఉంది. పోలీసుల భద్రత ఉన్న కోల్‌కత్తాలో పెద్ద ఆసుపత్రిలోనే వైద్యురాలిపై హత్యాచారం జరిగితే ఇతర ప్రాంతాల్లో వైద్యులకు రక్షణ ఎక్కడ ఉంటుంది. ఈ ఘటనలో న్యాయం జరిగేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తాం.

*- సందీప్‌చారి. జూడా, అధ్యక్షుడు, ఆదిలాబాద్, రిమ్స్*

### ఇలాంటి ఘటనలు సిగ్గుచేటు



వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన సమాజానికి సిగ్గుచేటుగా భావిస్తున్నాం. ఈ ఘటనను మహిళా సంఘాలు, ప్రజాసంఘాలతో పాటు ప్రతి ఒక్కరూ ఖండించి, వైద్యుల ఆందోళనకు మద్దతు ఇవ్వాలి. తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు కష్టపడి ఉన్నత చదువులు చదివిస్తున్నారు. కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారు. కానీ వారికి విధుల్లో రక్షణ లేకుండా పోతుంది. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

*- డాక్టర్ సుమలత, ఐఎంఏ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్*



నిర్మల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

### దాడులు నివారించాలి



వైద్య కళాశాలల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బందిపై దాడులు నివారణకు ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా వైద్యురాలిపై దాడితోపాటు ఉత్తరఖండ్ నర్సింగ్ ఆఫీసర్‌పై దాడి కిడ్నాప్, హైదరాబాద్ షాద్‌నగర్ నర్సింగ్ ఆఫీసర్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వ దవాఖానాల్లో 24 గంటల సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. వైద్యుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాం.

*- వెంకటేశ్, నర్సింగ్ ఆఫీసర్, ఆదిలాబాద్*



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిరసన ర్యాలీ తీస్తున్న రిమ్స్ వైద్యులు